APTEL/26A5612

# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు — తెలుగు దినపత్రిక

అనంతపురం | గురువారం 15 అక్టోబర్ 2026 | సంపుటి : 1 | సంచిక : 106 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | పేజీలు : 8 | వెల : 2/-

## 2,721 ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల



ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం మరో అవకాశం

2,721 పోస్టులతో డీఎస్సీ-2026 ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది.

**అమరావతి**

ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 2,721 పోస్టులతో డీఎస్సీ-2026 ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇందులో 350 ప్రత్యేక విద్య పోస్టులు ఉన్నాయని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకూ మెరుగైన విద్య, వ్యక్తిగత శ్రద్ధ అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లోనే ఉంటుందని కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తామని లోకేశ్? వెల్లడించారు. డీఎస్సీ - మిగతా3లో



### దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోంది

- అక్టోబర్ 14 నుంచి 16 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్
- ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

## స్థానిక ఎన్నికల్లో పోటీపై టీడీపీ, జనసేన

# చర్చలు సఫలం

- 2 రోజుల్లో జాబితా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై సీఎం చంద్రబాబుతో జనసేన నేతల సమావేశం
- ఎన్నికల్లో పోటీపై టీడీపీ, జనసేన చర్చలు సఫలమయ్యాయని ఎమ్మెల్యే బొలిశెట్టి తెలిపారు.
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిగానే పోటీ చేస్తున్నాం
- బలంగా ఉన్నచోట గెలవాలని చంద్రబాబు చెప్పారు



**అమరావతి**

స్థానిక ఎన్నికల్లో కూటమి సీట్ల సర్దుబాటు పంచాయితీకి తెరపడింది. మేయర్ పీఠాల దగ్గర మొదలైన చర్చలు అభ్యర్థుల ప్రకటన దిశగా చేరాయి. సీట్ల కోసం కొట్టుకుంటున్నారన్న సంకేతాలు ఇవ్వకుండా ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా కూటమి పార్టీల నేతలు సర్దుబాటు చేసుకున్నారు. సీఎం చంద్రబాబుతో జనసేన నేతల సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా చంద్రబాబుకు జనసేన నేతలు ధన్యవాదాలు తెలిపారు. భేటీ - మిగతా3లో



### సాదీలో దాడులు వెంటనే ఆపాలి

- ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు'
- భారతీయులకు కేంద్రం అడ్వైజరీ
- హూతీ తిరుగుబాటు దారులు సాదీలోని పౌర మౌలిక సదుపాయాలపై చేస్తున్న దాడుల్ని భారత్ ఖండించింది
- అక్కడి భారతీయులకు ఎంఈఏ కీలక మార్గదర్శకాలు జారీ

# మోగిన ఎన్నికల నగారా



28న కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగరపంచాయతీలకు పోలింగ్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఈమేరకు షెడ్యూల్ విడుదల

రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ప్రకటించారు.

**అమరావతి**

రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరం రానే వచ్చింది. స్థానిక సమరానికి సంబంధించిన పూర్తి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా విడుదల చేశారు. ఈ రోజు నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై, డిసెంబరు 2వ తేదీ వరకు సుదీర్ఘంగా కొనసాగనుంది. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ, మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ప్రకటించారు. - మిగతా3లో



### చైనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే వాస్తవాధీన రేఖ స్థిరంగా ఉండాలి

- సరిహద్దుల్లో ఎటువంటి అశాంతి చెలరేగినా దానికి పర్యవసానాలు ఉంటాయి
- విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం
- రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణ సరిహద్దు వద్ద శాంతితోనే ముడిపడి ఉన్నాయి

## జంతర్‌మంతర్ భారత ప్రజలది

- సీజేపీ నేతల కస్టడీపై విపక్షాలు ఫైర్
- సీజేపీ కార్యకర్తల జైలుకు పంపడంపై విపక్షాలు ఆగ్రహం
- యువతను జైలుకు పంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించాయి.





### విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.
- అంతరాలయంలో పూజల అనంతరం అర్చకులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం
- ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.
- సరస్ మేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



### ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..

- కొత్త ఆందోళనకు అభిజీత్ దీప్కే పిలుపు..
- సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం
- నిరసనకు 'లెహ్రా దో తిరంగా' పేరు..
- సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాల అరెస్టుకు నిరసనగా కార్యక్రమం
- అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
- స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే పిలుపు

# లింగ వివక్షత గర్భం నుశీడే నిర్మూలించాలి

## లింగ నిర్ధారణ కమిటీ సమావేశంలో... ఆర్డీవో.

**అనంతపురం అక్టోబర్ 14 తెలుగు స్వరం.**



కడుపులో ఉన్న బిడ్డ లింగాన్ని గుర్తించి ఆడ కూతురు అయితే అబార్షన్ పేరుతో చంపేయడం అరికట్టాలని సబ్ డివిజన్ లింగ నిర్ధారణ నిషేధ కమిటీ తీర్మానిశీచింది, బుధవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో అనంతపురం డివిజన్ లింగ నిర్ధారణ నిషేధ కమిటీ సమావేశం ఆర్డిఓ ప్రేమంత కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పాల్గొని లింగ నిర్ధారణకు సహకరిస్తున్న స్కానింగ్ సెంటర్లను గుర్తించి లింగనిర్ధన్ నిషేధ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఆడ కూతురు ప్రాముఖ్యతను తెలియజేసినందుకు విస్తృతమైన అవగాహన సదస్సులు కిశోర బాలికలకు నిర్వహించాలని కోరింది. కొత్త స్కానింగ్ సెంటర్లకు అనుమతులు మంజూరు చేసింది. ఈ కమిటీ సమావేశంలో టీకాల అధికారి ప్రసన్న భారతి, శిశు వైద్య నిపుణులు రవికుమార్, శ్రీ వైద్య నిపుణులు డాక్టర్ నిసార్ బేగం, పెథాలజిస్ట్ భవాని, సునీత సబ్ ఇన్స్పెక్టర్ త్రిలోకనాథ్, ఆర్డిటి హెల్త్ డైరెక్టర్ దుర్గేష్, హెడ్స్ సంస్థ ప్రతినిధి టి. శ్రావ్య, రెడ్స్ వ్యవస్థాపకులు భానుజా, రేడియాలజిస్ట్ చల్లా రాజేందర్ నాయుడు, సిడిపిఓ లలిత, డిప్యూటీ ఆరోగ్య విద్యాధికారి వేణుగోపాల్, డ్రగ్ ఇన్స్పెక్టర్ కార్యాలయ సహాయకుడు శ్రీకాంత్ రెడ్డి, లీగల్ అడ్వైజర్లు సంధ్యారాణి, ఆషారాణి , తదితరులు పాల్గొన్నారు


# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు

## రాయల సీమ

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా




## సీఎం రిలీఫ్ ఫండ్....

# పేద ఫ్యామిలీకి ఆర్థిక భరోస..!!

......పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

.....70 మందికి రూ.31.43 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి సవిత

.....28 నెలల్లో 1,461 మందికి రూ.15.75 కోట్ల సాయం: మంత్రి సవిత

**పెనుకొండ అక్టోబర్ 14 తెలుగు స్వరం.**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అర్హులకు ఆర్థిక సహాయం అందిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 70 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.31,43,227 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. పెనుకొండ నియోజకవర్గ పరిధిలో గత 28 నెలల్లో 1,461 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మొత్తం రూ.15 కోట్ల 75 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన పేదలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలో అర్హులైన వారికి పెన్షన్లు, గృహ వసతి కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు..







# పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యం..!!

.... అనంతలో ఉమ్మడి జిల్లాల జిపిఎఫ్ అదాలత్ మొదటి రోజు కార్యక్రమాలు.

.... పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆనంద్.




**అనంతపురం, అక్టోబర్ 14: తెలుగు స్వరం.** ప్రభుత్వ ఉద్యోగులుగా విశేష సేవలందించి పదవీ విరమణ చేసిన పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు.బుధవారం ఉదయం అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించి పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ మొదటి రోజు కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ అండ్ ఎంటైటిల్మెంట్స్), ఆంధ్రప్రదేశ్ శ్రీమతి శాంతి ప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ శ్రీ ఎస్. కుశల్ కార్తిక్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ శ్రీమతి ఆశ్రిత నౌపాడ, అనంతపురం జిల్లా ట్రెజరీ డీడీ, శ్రీ సత్యసాయి జిల్లా ట్రెజరీ డీడీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, పలువురు పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ, ప్రభుత్వ యంత్రాంగంలో విధులు నిర్వహిస్తున్న ప్రస్తుత ఉద్యోగులతో పాటు పదవీ విరమణ చేసిన సిబ్బంది తమ సర్వీసు కాలంలో ప్రభుత్వానికి అందించిన సేవలు ఎంతో అమూల్యమైనవని అన్నారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించడం ప్రతి శాఖ బాధ్యత అని పెన్షనర్ల సేవలను గుర్తించి ఆయా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.గతంలో పెన్షన్ మంజూరు కోసం ఉద్యోగులు ఏజీ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. సీనియర్ సిటిజన్లను గుర్తించి, గౌరవిస్తూ ఏజీ కార్యాలయ అధికారులు క్షేత్రస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తరపున కూడా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సాధ్యమైనంతవరకు తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రెండో రోజు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు, పెన్షనర్లు హాజరై తమ సమస్యల పరిష్కారానికి మార్గాలను పొందవచ్చని - మిగతా3లో

# రూపు రేఖలు మారుతున్న... కదిరి తిరుమాడ వీధులు..!!

.....కదిరిలో తిరుమాడ వీధి రోడ్డు విస్తరణ పనుల భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.

.....రోడ్ల పనుల విస్తరణలో ప్రజలకు ఇబ్బంది లేకుండా నష్ట పరిహారం చెల్లించి పనులు చేపడతాం ఎమ్మెల్యే ....

.....కదిరి అభివృద్ధికి అందరు తోడ్పాటు అందిస్తే కదిరిని సుందరీ కరణగా తీర్చిదిద్దడమే ఎమ్మెల్యే లక్ష్యం.





**కదిరి, (బ్యూరో) అక్టోబర్ 14 తెలుగు స్వరం.** కదిరి పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ తోడ్పాటు అందిస్తే కదిరి రూపురేఖలు మార్చి సుందరీ కారణంగా మార్చడమే నా లక్ష్యం మని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు.గురువారం పట్టణంలోని తిరుమాడ వీధి రోడ్డు విస్తరణ పనులకు కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే శ్రీ ఎంఎస్ పార్థసారథి, నియోజకవర్గ పరిశీలకులు శ్రీ చెంచయ్య నాయుడు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ముస్లిం పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ కదిరి పట్టణ అభివృద్ధిలో రోడ్డు విస్తరణ కీలకమైన భాగం. ఈ పనులపై ఎవరూ అపోహలకు గురికావద్దు. ఎవరు ఎలాంటి ఆటంకాలు సృష్టించినా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరి సహకారంతో, ఎవరికీ అన్యాయం - మిగతా3లో



# మోగిన ఎన్నికల నగారా

-మొదటిపేజీ తరువాయి
పురపాలక (మున్సిపల్) ఎన్నికల షెడ్యూల్ : రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాల్టీలు, 10 నగర పంచాయతీలకు అక్టోబరు 28న పోలింగ్ నిర్వహించనున్నారు.
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: అక్టోబరు 18
నామినేషన్ల పరిశీలన: అక్టోబరు 19
నామినేషన్ల ఉపసంహరణ: అక్టోబరు 21
పోలింగ్ తేదీ: అక్టోబరు 28
ఫలితాలు: అక్టోబరు 30
ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ : పరిషత్ పోరుకు సంబంధించి ఈ నెల 19వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. నవంబరు 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.
ఎన్నికల నోటిఫికేషన్: అక్టోబరు 19
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: అక్టోబరు 23
నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబరు 27
పోలింగ్ తేదీ: నవంబరు 3
ఫలితాల వెల్లడి: నవంబరు 5
రాశీఝ్రశ్రీ దీశీఎఎ జుశ్రీవఞ్ఱశీఅం 2026
మూడు విడతల్లో పంచాయతీల సమరం : గ్రామ పంచాయతీలకు 3 విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 26, 29, డిసెంబరు 2వ తేదీల్లో పోలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.
మొదటి విడత :
నోటిఫికేషన్: నవంబరు 13
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: నవంబరు 17
నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబరు 21
పోలింగ్ తేదీ: నవంబరు 26
రెండో విడత :
నోటిఫికేషన్: నవంబరు 18
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: నవంబరు 20
నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబరు 24
పోలింగ్ తేదీ: నవంబరు 29
**మూడవ విడత :**
నోటిఫికేషన్: నవంబరు 19
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: నవంబరు 23
నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబరు 27
**పోలింగ్ తేదీ: డిసెంబరు 2**
మొత్తంగా ఈ రోజు నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి ఉండనుంది. షెడ్యూల్ విడుదల కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై కసరత్తులు చేస్తున్నాయి.

# పులివెందుల వైసీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీల

**కడప :** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తన సొంత అడ్డా పులివెందులకు అభ్యర్థిని ఖరారు చేశారు. పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ వైయస్ఆర్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి వైఎస్ ప్రమీలమ్మ పేరును జగన్ అధికారికంగా ప్రకటించారు. ఈ సారి కుటుంబసభ్యులకు కాకుండా బయట వారికి చాన్సిస్తారని ప్రచారం జరిగినా.. అలాంటి ధైర్యం చేయలేకపోయారు.మనోహర్ రెడ్డి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు మనోహర్ రెడ్డి.. జగన్‌కు బాబాయ్ వరుసవుతారు. అటు జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి వైపు నుంచి కూడా వీరికి బలమైన కుటుంబ బాంధవ్యాలు ఉన్నాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా పులివెందుల స్థానిక రాజకీయాలు, గ్రామీణ పంచాయతీల నుంచి మున్సిపాలిటీ వరకు అంతా మనోహర్ రెడ్డి కనుసన్నల్లోనే నడిచేది. వైఎస్సార్ హయాం నుంచే స్థానిక సంస్థల పెత్తనాన్ని గుత్తాధిపత్యంగా నడిపిస్తున్న ఆయన.. జగన్ కేంప్ కార్యాలయం, భారతి వ్యవహారాల్లోనూ తెరవెనుక కీలక చక్రం తిప్పుతూ వచ్చారు.పులివెందుల పురపాలక సంఘం చరిత్రను తిరగేస్తే.. ఈ దంపతుల చేతుల్లోనే స్థానిక అధికారం దశాబ్దాలుగా బందీ అయిందన్నది బహిరంగ రహస్యం. గతంలోనూ వైఎస్ ప్రమీలమ్మ పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. భర్త మనోహర్ రెడ్డి చక్రం తిప్పుతుంటే, భార్య ప్రమీలమ్మ చైర్‌పర్సన్ కుర్చీలో కూర్చుని నామమాత్రపు పాలన సాగించేవారు. మున్సిపాలిటీలో పనుల కేటాయింపులు, స్థానిక కాంట్రాక్టులు, వార్డుల నిర్వహణ అన్నీ



వీరి కనుసన్నల్లోనే సాగాయి . పులివెందుల మున్సిపాలిటీలో నిజమైన ప్రజాస్వామిక ప్రాతినిధ్యం గానీ, కొత్త నాయకత్వానికి అవకాశం గానీ దక్కలేదు. పార్టీలో ఏళ్ల తరబడి జెండాలు మోసి, కేసులు ఎదుర్కొన్న సామాన్య కిందిస్థాయి కార్యకర్తలకు ఎప్పుడూ కార్పొరేటర్ లేదా వార్డు మెంబర్ టికెట్లే మిగిలాయి తప్ప.. కీలకమైన చైర్‌పర్సన్ కుర్చీ మాత్రం మళ్లీ తిరిగి ప్రమీలమ్మ ముంగిట్లోనే వాలింది.కడప ఎంపీగా అవినాష్ రెడ్డి, అసెంబ్లీలో జగన్, ఇప్పుడు మున్సిపాలిటీలో బాబాయ్ భార్య ప్రమీలమ్మ.. ఇలా స్థానిక నుంచి పార్లమెంట్ దాకా అధికారం అంతా నాలుగు గోడల మధ్యే ఉండాలన్న జగన్ ఆధిపత్య మనస్తత్వాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలోనే మెజారిటీ గణనీయంగా తగ్గిపోయి సొంత గడ్డపైనే పట్టు సడలిన సంకేతాలు కనిపించినప్పటికీ.. జగన్ మాత్రం కనీస మార్పునకు సిద్ధపడలేదు.ఈ సారి ప్రత్యక్ష ఎన్నిక కావడంతో .. టీడీపీ బలమైన మహిళా అభ్యర్థిని నిలిపే అవకాశం ఉంది.

# విశాఖ మేయర్ పీఠంపై తెరపైకి బాలయ్య కూతురి పేరు

**విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం మేయర్ పదవికి ప్రత్యేక గుర్తింపు ఉంది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నగర ప్రాధాన్యం, భారీ బడ్జెట్ కారణంగా ఈ పదవిని దక్కించుకోవాలని రాజకీయ నాయకులు ఆసక్తి చూపుతుంటారు. తాజాగా మేయర్ పదవికి మహిళా రిజర్వేషన్ ఖరారైనట్లు ప్రచారం జరగడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అధికార కూటమితో పాటు వైఎస్సార్‌సీపీ కూడా బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ముఖ్యంగా టీడీపీకి చెందిన ప్రముఖ కుటుంబాల మహిళల పేర్లు తెరపైకి రావడం ఆసక్తిని పెంచుతోంది.విశాఖ మేయర్ పదవి మరోసారి మహిళకు దక్కనుండటంతో మహిళా నాయకుల మధ్య పోటీ పెరిగే అవకాశం కనిపిస్తోంది. 2021లో జరిగిన మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బీసీ వర్గానికి చెందిన గొలగాని హరి వెంకట కుమారి బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు కూడా మహిళా అభ్యర్థికే అవకాశం ఉండటంతో పార్టీలు సామాజిక సమీకరణాలు, రాజకీయ బలాబలాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.
ఈ క్రమంలో నందమూరి తేజస్విని పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమె సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రెండో కుమార్తె. విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ సతీమణి కూడా. రాజకీయంగా ప్రభావం ఉన్న కుటుంబానికి చెందిన ఆమెను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టవచ్చనే ప్రచారం సాగుతోంది. గతంలో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2029 ఎన్నికల్లో పోటీ చేస్తారనే ఊహాగానాలు కూడా వినిపించాయి. అయితే మేయర్ పదవికి పోటీ చేసే విషయంలో ఆమె ఆసక్తి, పార్టీ నిర్ణయం ఏమిటన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. ఆమె పేరు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చకు పరిమితమైంది.మరోవైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ సతీమణి లావణ్య పేరు కూడా వినిపిస్తోంది. ఆమెకు అవకాశం దక్కుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ టీడీపీ అధ్యక్షుడు పట్టాభిరాం సతీమణి పేరును కూడా కొందరు ప్రస్తావిస్తున్నారు. జనసేన నుంచి పెద్దిశెట్టి ఉషశ్రీ, ఉత్తర నియోజకవర్గానికి చెందిన ఉషా కిరణ్ పేర్లు చర్చలో ఉన్నాయి. బీజేపీ నుంచి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుటుంబానికి చెందిన మహిళ పోటీ చేస్తారా అన్నది కూడా రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది.వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ పేరు వినిపిస్తున్నప్పటికీ, ఆమె పోటీపై స్పష్టత లేదు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి పేరు కూడా ప్రచారంలో ఉంది. మాజీ ఎమ్మెల్యేల కుటుంబాల నుంచి కొత్త అభ్యర్థులు తెరపైకి వచ్చే అవకాశాలనూ కొట్టిపారేయలేం.మొత్తంగా విశాఖ మేయర్ పీఠం కోసం ప్రధాన పార్టీల్లో ఇప్పటి నుంచే కసరత్తు మొదలైనట్లు కనిపిస్తోంది. అయితే ప్రచారంలో ఉన్న పేర్లలో ఎవరికి పార్టీలు అవకాశం కల్పిస్తాయన్నది అధికారిక ప్రకటనల తర్వాతే తేలనుంది.



సామాజిక సమీకరణాలు, రాజకీయ పలుకుబడి, స్థానిక నాయకుల మద్దతు ఈ ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది.

## ధర్మానకు శీల పరీక్ష.. !

**శ్రీకాకుళం :** ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కీలకమైన శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వైసిపి ఏ విధంగా ముందుకు సాగుతుంది?. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ విధంగా ఫలితాన్ని తెచ్చుకుంటుంది? అనేది ఆసక్తిగా మారింది. కీలక మైన నాయకుడిగా గుర్తింపు పొందిన ధర్మాన ప్రసాదరావుకు ఈ ఎన్నిక ఒకరకంగా శీల పరీక్ష పెడుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా గత రెండున్నర ఏళ్ల కాలంలో వైసిపి తరఫున శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో పెద్దగా కార్యక్రమాలు ఏవి చేపట్టలేదు.కార్యకర్తలతో మాస్ స్పీచ్ ఒక్క కార్యక్రమంలో మాత్రమే ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నప్పటికీ బలమైన ముద్రనైతే వేయలేకపోయారు. కానీ, పార్టీ పరంగా ధర్మాన తర్వాత ఇంకెవరూ లేరు అనే మాట వినిపిస్తున్న నేపథ్యంలో ఆయన శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఏ విధంగా పార్టీని గెలుపు దిశగా అడుగులు వేసేలా చేస్తారు అన్నది ప్రశ్న. ప్రధానంగా కూటమిక్కడ బలంగా పనిచేస్తుంది. శ్రీకాకుళం నియోజకవర్గ కావచ్చు శ్రీకాకుళం జిల్లాలో కావచ్చు మొత్తంగా టిడిపి జనసేన ల ప్రభావం భారీగా కనిపిస్తోంది. – ఈ క్రమంలో బలమైన కూటమి పక్షాలను ఎదుర్కొని ఇక్కడ వైసిపి పాగా వేయాలి అంటే ధర్మాన ఇంతకు నాలుగింతల కృషి చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ ఎన్నికల్లో ధర్మాన గెలుపు దిశగా అడుగులు వేస్తే తప్ప వచ్చే ఎన్నికల నాటికి ఆయన ఇమేజ్ బలపడడంతో పాటు ఆయన ఓటు బ్యాంకు పెరిగే అవకాశాలు కూడా తక్కువగానే ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికిప్పుడు పరిస్థితిని చూస్తే కూటమికే శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో అనుకూలమైన వాతావరణం ఉంది. మాజీ ఎమ్మెల్యే గుండా లక్ష్మీదేవి కార్పొరేషన్ మేయర్ సీటు కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నం చేస్తున్నారు. దీనిని టిడిపికే కేటాయిస్తే గుండె లక్ష్మీదేవి విజయం సాధించడం సునాయాసం అవుతుంది అన్న వాదన కూడా వినిపిస్తోంది. ఇక వ్యక్తిగతంగా లక్ష్మీదేవికి ఉన్న మెజారిటీ మహిళా ఓటు బ్యాంకు మాజీ ఎమ్మెల్యేగా ఆమెకు ఉన్న గుర్తింపు కుటుంబ పరంగా ఉన్న ఇమేజ్ వంటివి కూడా కలిసి వస్తాయని అంటున్నారు. ఇవన్నీ దాటుకుని వైసీపీని ఇక్కడ గెలిపించడం కార్పొరేషన్ లో పాగా వేయటం అనేది ధర్మానకు శిల పరీక్షగా మారనుందని తెలుస్తోంది. మరి ఏం చేస్తారనేది చూడాలి.

## రూపు రేఖలు మారుతున్న... కదిరి తిరుమాడ వీధులు..!!

-మొదటిపేజీ తరువాయి
జరగకుండా రోడ్డు విస్తరణ పనులు చేపడతాం. ఇందులో ఎవరినీ బలవంతం చేయం. ఎవరికీ అన్యాయం జరగనివ్వం! నిబంధనల ప్రకారం నోటీసులు అందించి, ప్రభుత్వ విధివిధానాల మేరకు అర్హులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే సంబంధిత ప్రక్రియను కొనసాగిస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అందరినీ సంప్రదిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తాం. కదిరి పట్టణానికి ఆధ్యాత్మికంగా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తాం. దేవస్థానం ఆదాయాన్ని భవిష్యత్తులో రూ.100 కోట్ల స్థాయికి తీసుకెళ్లే దిశగా చర్యలు చేపడతాం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు, ఆతిథ్యం కల్పించి, వారు సంతోషంగా స్వామివారిని దర్శించుకునేలా కదిరిని అభివృద్ధి చేస్తాం. రానున్న రోజుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, భూగర్భ విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. పట్టణంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతాం.కదిరి అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రజల సహకారంతో కదిరిని మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దాం" అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు, ముస్లిం మత పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి...

**నంబులపూలకుంట, అక్టోబర్ 14 తెలుగుస్వరం (బ్యూరో)** నంబులపూలకుంట మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఈనెల 18న ఆదివారంనిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని తెదేపా మండల క్లస్టర్ ఇంచార్జ్ దండే రవిశంకర్ తెలిపారు. కొప్పుల మీనాక్షి అమ్మ ఫౌండేషన్ అనంతపురం వారిసౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరముకు కంటి వైద్యులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, పవనేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఈశ్వర్రావుసాకర్, హాజరవుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు గమనించి కంటి సమస్య ఉన్నవారు ఈ వైద్య శిబిరానికి హాజరై చికిత్సలు పొందాలని పేర్కొన్నారు.

## పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యం..!!

-మొదటిపేజీ తరువాయి
సూచించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పెన్షన్, జీపీఎఫ్ సేవలకు సంబంధించిన సందేహాలు, విధివిధానాలపై అవగాహన పెంపొందించుకుని తమ సమస్యలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**సమస్యల పరిష్కారమే లక్ష్యం**
అంతకుముందు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ అండ్ ఎంటైటిల్మెంట్స్), ఆంధ్రప్రదేశ్ శ్రీమతి శాంతి ప్రియ మాట్లాడుతూ, ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పెన్షన్ పొందడం వారి హక్కు అని, ఆ ప్రయోజనాలను సక్రమంగా అందించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఏజీ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా, వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు.పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులకు న్యాయం చేయడం, వారి సమస్యలను పరిష్కరించడం ఏజీ కార్యాలయ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పెన్షన్, జీపీఎఫ్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.

## విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అంతరాలయంలో పూజల అనంతరం అర్చకులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి హోంమంత్రి అనిత, ఎంపీ కేశినేని చిన్ని, ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ స్వాగతం పలికారు. క్యూలైన్లలోని భక్తులకు నమస్కారం చేస్తూ రాష్ట్రపతి ముందుకు సాగారు.
అంతకుముందు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి రాష్ట్రపతి ముర్ము చేరుకున్నారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడకు చేరుకున్నారు. రాష్ట్రపతి పర్యటన దృష్ట్యా అరగంటపాటు దర్శనాలు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను ఆలయ అధికారులు పకడ్బందీగా చేపట్టారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రిపై సామాన్య భక్తులకు యథావిధిగా దర్శనాలు కల్పిస్తున్నారు.

**సరస్ మేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**
రేపు(15న) పున్నమి ఘాట్‌లో నిర్వహించే సరస్ మేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలు, లఖ్‌పతి దీదీలతో కలిసి విందులో పాల్గొని మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సీఎస్ సాయిప్రసాద్ ఆదేశించారు. అలాగే 14, 15 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, నిమిషాల వారీగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు**
మరోవైపు ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు శ్రీమహా చండీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మహాలక్ష్మీ, మహాకాళీ, మహాసరస్వతీ కలిసిన త్రిశక్తి స్వరూపిణిగా మహాచండీ అమ్మవారు ఉద్భవించింది. ఈ అమ్మవారిలో అనేకమంది దేవతలు కొలువై ఉన్నారు. మహాచండీ రూపంలోని దుర్గమ్మను ప్రార్థిస్తే సర్వదేవతలను ప్రార్థించినట్టేనని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అమ్మవారి అనుగ్రహం వల్ల విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారతారు. భక్తుల సంకల్పాలు నెరవేరి విజయం సిద్ధిస్తుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే భారీ సంఖ్యలో తరలివస్తున్నారు.

## 2,721 ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల

-మొదటిపేజీ తరువాయి
సిలబస్‌ను ఇప్పటికే వ2ఎంఎ.ఖజూఎటంం.ఱఅ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని నవంబర్ 3 లోగా పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

**జాబ్ క్యాలెండర్ ప్రకారం**
ఏటా డీఎస్సీ ప్రకటిస్తామని ఇచ్చిన హామీలో భాగంగా మంగళవారం రాత్రి డీఎస్సీ

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఓ.డీ.సీ. విద్యార్థుల సత్తా!

**శ్రీ జ్ఞానసాయి విద్యానికేతన్‌కు మూడు కాంస్య పతకాలు.. విద్యార్థుల ప్రతిభకు ప్రశంసల వెల్లువ**

**అండర్-14లో రేవంత్‌రెడ్డి, అండర్-17లో బ్రహ్మణి, రుక్సానా ప్రతిభ**

**ఓబులదేవరచెరువు, అక్టోబర్ 15 (తెలుగు స్వరం):** రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల బాక్సింగ్ పోటీల్లో శ్రీ సత్యసాయి జిల్లా, ఓబులదేవరచెరువు మండలంలోని శ్రీ జ్ఞానసాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈ నెల 12, 13 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులతో పోటీపడి పతకాలు సాధించడం ద్వారా పాఠశాలకు, తమ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు.

**మూడు పతకాలతో మెరిసిన విద్యార్థులు**

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో అండర్-14 విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న రేవంత్‌రెడ్డి కాంస్య పతకాన్ని సాధించాడు. అదేవిధంగా అండర్-17 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు బ్రహ్మణి, రుక్సానా తమ ప్రత్యర్థులతో పోటీపడి కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. వేర్వేరు వయో విభాగాల్లో విద్యార్థులు కనబరిచిన ప్రతిభ పాఠశాల క్రీడా ప్రోత్సాహానికి నిదర్శనంగా నిలిచింది. రాష్ట్రస్థాయి వేదికపై తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి పతకాలు సాధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల




యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

**కోచ్ కృషికి అభినందనలు**

విద్యార్థులు బాక్సింగ్‌లో రాణించి పతకాలు సాధించడం వెనుక శిక్షణ, క్రమశిక్షణ, నిరంతర సాధన కీలక పాత్ర పోషించాయి. విద్యార్థులకు బాక్సింగ్‌లో శిక్షణ అందించిన కోచ్ కిరణ్, పాఠశాల మేనేజర్ శోభారాణిని యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఈ విజయాలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు.

**చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం**

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ క్రిష్ణ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా పాఠశాల యాజమాన్యం నిరంతరం ప్రోత్సహిస్తోందని తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, సమయపాలన వంటి లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ముగ్గురు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వారి విజయాలు పాఠశాలలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని, భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించేలా అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తామని తెలిపారు.

**పాఠశాలలో ఆనందోత్సాహాలు**

ఒకే పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించడంతో శ్రీ జ్ఞానసాయి విద్యానికేతన్‌లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. విద్యార్థుల విజయంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తూ విజేతలను అభినందించారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయిలను అధిగమించి జాతీయ స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. ఓబులదేవరచెరువు ప్రాంత విద్యార్థుల్లో క్రీడా ప్రతిభకు కొదవలేదని ఈ విజయం చాటిచెప్పింది.

## కొండకమర్లలో పోలీసుల అవగాహన కార్యక్రమం

**నేరాల నివారణ, మహిళల భద్రతపై ప్రజలకు అవగాహన**

**ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని పోలీసుల సూచన**



**ఓబులదేవర చెరువు , అక్టోబర్ 14 ( తెలుగు స్వరం ):** ఓబులదేవర చెరువు మండలంలోని కొండకమర్ల గ్రామాన్ని పుట్టపర్తి డీఎస్పీతో కలిసి బుధవారం సందర్శించినట్లు అమడగూరు ఎస్ ఐ గోపాలకృష్ణ తెలిపారు. ఈ సంధర్భంగా గ్రామ ప్రజలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. నేరాల నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, మాదకద్రవ్యాల దుర్వినియోగం, మహిళల భద్రత, రహదారి భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణపై ప్రజలకు వివరించామనీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీ వంటి కీలక సమాచారాన్ని ఇతరులకు వెల్లడించకూడదని తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలు, అనుమానాస్పద సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.

**ఎన్నికల వేళ సంయమనం పాటించాలి**

రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామ ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో రాజకీయ వర్గాల మధ్య ఘర్షణలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని, గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం లేదా ఇతర వస్తువుల పంపిణీ వంటి అక్రమ చర్యలకు పాల్పడకూడదని వివరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చట్టాలను ఉల్లంఘించే చర్యలకు దూరంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. గ్రామంలో శాంతి, సామరస్యాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించినప్పుడే నేరాల నియంత్రణతో పాటు ప్రశాంత వాతావరణం సాధ్యమవుతుందని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో ఓ. డి సి ,అమడగూరు పోలీస్ సిబ్బంది చంద్రా , గంగాధర్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు .

## మాతృశ్రీ వృద్ధాశ్రమంలో సాయి ధరమ్ తేజ్ జన్మదిన వేడుకలు




**ఓబుల దేవర చెరువు, అక్టోబర్ 14 (తెలుగు స్వరం):** సినీ నటుడు మెగా సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కదిరి మెగా యూత్ ఫోర్స్ సభ్యులు అమడగూరులోని మాతృశ్రీ వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణ మాట్లాడుతూ, సాయి ధరమ్ తేజ్ మరిన్ని విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను వృద్ధుల మధ్య నిర్వహించిన మెగా యూత్ ఫోర్స్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మెగా యూత్ ఫోర్స్ కదిరి నియోజకవర్గ కన్వీనర్ దాసరి కార్తీక్ మాట్లాడుతూ, ఆదరణకు నోచుకోని వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ సేవలందిస్తున్న మాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అరుణ జ్యోతిని అభినందించారు. మెగా కుటుంబం అభిమానులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని పేర్కొంటూ సాయి ధరమ్ తేజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తమకు మార్గనిర్దేశం చేస్తున్న మెగా యూత్ ఫోర్స్ జాతీయ కన్వీనర్ ఏడిద బాబీ, ఫౌండర్ సుస్మిత, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కో-కన్వీనర్ లక్ష్మణ కుటాల, జాయింట్ కన్వీనర్ మంగళమడక మనోహర్, కమిటీ సభ్యులు హరిబాబు, కరము మిథున్, ముని గోపాల్, వరుణ్ తదితరులు

## పరిగి జడ్పీటీసీ బరిలో సీగుపల్లి నాగప్ప?

**బీసీ రిజర్వేషన్‌తో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ**

**నారా లోకేశ్‌తో సత్సంబంధాలు ఉన్న నాగప్ప అభ్యర్థిత్వంపై స్థానికంగా జోరుగా చర్చ**



**పరిగి అక్టోబర్ 14 తెలుగు స్వరం:** పరిగి మండల జడ్పీటీసీ స్థానం బీసీకి రిజర్వు కావడంతో స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. రిజర్వేషన్ నేపథ్యంలో జడ్పీటీసీ అభ్యర్థిగా ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో టీడీపీ తరపున సీగుపల్లి నాగప్ప పేరు తెరపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నాగప్పకు జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించవచ్చనే ప్రచారం స్థానికంగా సాగుతోంది. ఆయన చేసిన సేవలు, రాజకీయంగా చూపిన చొరవను గుర్తించి పార్టీ నాయకత్వం పరిశీలించే అవకాశం ఉందని ఆయన అనుచర వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో నాగప్పకు ఉన్న సత్సంబంధాలు ఆయన అభ్యర్థిత్వంపై చర్చకు కారణమవుతున్నాయి. జడ్పీటీసీ అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నాగప్పకు అవకాశం దక్కుతుందా? లేక పార్టీ మరో అభ్యర్థిని ఎంపిక చేస్తుందా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అయితే పార్టీ నాయకత్వం నిర్ణయం ప్రకటించిన తర్వాతే పరిగి జడ్పీటీసీ అభ్యర్థిత్వంపై స్పష్టత రానుంది.

## 250 మంది నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలి

**హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి**

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి డిమాండ్**



**పెనుకొండ అక్టోబర్ 14 తెలుగు స్వరం:** శ్రీకృష్ణదేవరాయల కాలనీలో నివాసం ఉంటున్న 250 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు బాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెనుకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2008లో గోనుపెంట రోడ్డు సమీపంలోని హైవే పక్కన ఉన్న సర్వే నంబర్ 272లో సుమారు 250 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఏర్పరచుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి పట్టాల కోసం పలుమార్లు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించినా ఫలితం లేకపోయిందన్నారు. పట్టాల కోసం కాలనీ వాసులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయించగా, 2010లో డబ్ల్యూపీ నంబర్ 21482కు సంబంధించి కోర్టు ఆదేశాలు వెలువడ్డాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు పట్టాలు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా నిరుపేదలకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. కాలనీని సందర్శించిన మంత్రి పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే 250 మంది లబ్ధిదారుల్లో ఎంతమందికి సర్టిఫికెట్లు ఇచ్చారో స్పష్టత లేదని అన్నారు. సంబంధిత అధికారులు, మంత్రి స్పందించి కోర్టు ఆదేశాల్లోని లబ్ధిదారుల జాబితా ప్రకారం అర్హులందరికీ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిల భారత మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు అంజనమ్మ, ఏవైఎఫ్ నాయకులు ఎస్. కుమార్, శ్రీనివాసులు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ బీకే పార్థసారథి

**నరసింహప్ప కుమార్తె వివాహ వేడుకకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ**



పెనుకొండ అక్టోబర్ 14 తెలుగు స్వరం: శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలం సానిపల్లి గ్రామానికి చెందిన చోలేమర్రి నరసింహప్ప కుమార్తె వివాహ వేడుకకు హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి హాజరయ్యారు. పైడేటి సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో నిర్వహించిన ఈ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పరస్పర అనురాగంతో నిండాలని ఆకాంక్షించారు. నూతన జీవితంలో అడుగుపెట్టిన వధూవరులు కుటుంబ సభ్యుల ఆశీస్సులతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఎంపీ బీకే పార్థసారథి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం - ఎంపీ పార్థసారథి



**పైడేటిలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ**

**పరిగి అక్టోబర్ 14 తెలుగు స్వరం:** పరిగి మండలంలోని పైడేటి గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవస్థానం నిర్మాణ పనులను హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**29 రోజులుగా నిరసన.. సీఐటీయూ సంఘీభావం**



**పెనుకొండ అక్టోబర్ 14 తెలుగు స్వరం:** పెనుకొండ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గత 29 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న వీఆర్ఏలకు సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి హరి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బాబావలి మాట్లాడుతూ.. వీఆర్ఏలు ఇన్ని రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు వీఆర్ఏలకు అండగా నిలిచి సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు వలి, సుధాకర్, బాబు, వీఆర్ఏలు నరసప్ప, తిమ్మయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరిలో శ్రీ మహాలక్ష్మి అలంకరణలో మహేశ్వరిదేవి

**శ్రీగిరి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు, హోమాలు**



**పెనుకొండ అక్టోబర్ 14 తెలుగు స్వరం:** పెనుకొండ మండలంలోని చంద్రగిరి గ్రామంలో కొలువుదీరిన శ్రీగిరి శక్తిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాలుగో రోజు మహేశ్వరిదేవిని శ్రీ మహాలక్ష్మి అలంకరణలో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగిరి శక్తిపీఠం పీఠాధిపతి దేవేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు హోమాలను నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, హోమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి కృపాకటాక్షాలు సర్వజనులపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A5612 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881